ఆంధ్రజ్యోతి
andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.0, కనిష్ఠం 17.7
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
బుధవారం 31 జనవరి 2024





రైతుల చుట్టూ రాజకీయం

సమీపిస్తున్న పార్లమెంట్ ఎన్నికలు ● పసుపు రైతుల చుట్టూ నేతల ప్రదక్షిణలు

- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మళ్లీ ముందుకు వస్తున్న పసుపు రైతుల సమస్యలు
- పసుపు బోర్డు ప్రకటనతో ముందుకు వెళ్లేందుకు బీజేపీ నేతల సన్నద్ధం
- పసుపు రైతులకు మద్దతు పేరిట ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్న కాంగ్రెస్ నేతలు
- రెండు పార్టీల హామీల అమలును నిలదీస్తూ ప్రచారానికి బీఆర్‌ఎస్ నేతల యత్నం
- ఇప్పటికీ తమ వైఖరిని బయటపెట్టని పార్లమెంట్ పరిధిలోని పసుపు రైతులు

నిజామాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో పసుపు రైతుల చుట్టూ రాజకీయం జోరందుకుంది. ఎన్నికల సమయంలోనే ప్రతిసారి పసుపు రైతుల సమస్యలు ముందుకు వస్తున్నాయి. పసుపు బోర్డు, మద్దతు ధర అంశాలను ప్రధాన రాజకీయ పార్టీలు తెరపైకి తెస్తున్నాయి. గత పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు ధర, పసుపు బోర్డు కోసం ఏకంగా 180మంది రైతులు నామినేషన్లు వేసి తమ నిరసనను తెలిపారు. పసుపునకు మద్దతు ధర కల్పించడంతో పాటు బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిసారి ఎన్నికల్లో పసుపు రైతులు పార్లమెంట్ పరిధిలో జయాపజయాలను ప్రభావితం చేస్తున్నారు. ఈ రైతులు మద్దతు తెలిపిన పార్టీలే విజయం సాధిస్తున్నాయి. ఆ పార్టీలకు చెందిన అభ్యర్థులే ఎమ్మెల్యేలు, ఎంపీలుగా గెలుస్తున్నారు. శాసనసభ ఎన్నికల ముందు పసుపు బోర్డు ప్రకటన చేయగా బీజేపీకి కలిసివచ్చింది. పార్లమెంట్ పరిధిలోనే రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే సీట్లను కైవసం చేసుకుంది. మిగతా ఐదు నియోజకవర్గాల్లో డిపాజిట్లు దక్కించుకోవడంతో పాటు భారీ ఓట్లను సాధించింది. ఇదే పసుపు రైతుల సమస్యను కాంగ్రెస్ కూడా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రెండు సీట్లను గెలుచుకుంది.

మద్దతు ధర కోసం రైతుల ఆందోళనలు

జిల్లాలో దశాబ్దాలుగా సాగు చేస్తున్న రైతులు కొన్నేళ్లుగా ధర తగ్గడంతో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. పసుపునకు మద్దతు ధర కల్పించాలని పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని 30ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నారు కొన్ని దఫాలు కాంగ్రెస్‌కు మద్దతు పలకగా, మరికొన్ని సార్లు బీఆర్‌ఎస్‌కు మద్దతిచ్చారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఢిల్లీ వరకు వెళ్లి ఆందోళన నిర్వహించారు. జిల్లాతో పాటు జగిత్యాల, నిర్మల్ జిల్లాల పరిధిలో కూడా పసుపు సాగు కొనసాగుతోంది. ఈ జిల్లా రైతులు కూడా మద్దతు ధర కోసం ఆందోళనలో పాలుపంచుకున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఈ ఆందోళన బాగా పెరిగింది. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చి పరిష్కరించలేదని రైతులు అప్పటి పార్లమెంట్ ఎన్నికల్లో 180మంది నామినేషన్లు వేశారు. సీఎం కూతురు ఎమ్మెల్సీ కవిత ఓటమికి కారణమయ్యారు. ఆ ఎన్నికల్లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని బీజేపీ అభ్యర్థి అర్వింద్ హామీ ఇవ్వడంతో రైతులు మద్దతు పలికారు. భారీ మెజార్టీతో గెలిపించారు. కాంగ్రెస్‌కు నామమాత్రం ఓట్లతో సరిపెట్టారు. ఎన్నికల సమయంలో బాండ్ పేపర్ రాసిచ్చిన ఎంపీ అర్వింద్ ఆ తర్వాత తనవంతు ప్రయత్నాలను చేశారు. అనుకున్న సమయంలో పసుపు బోర్డు ఏర్పాటు చేయకపోయినా శాసనసభ ఎన్నికల ముందు జిల్లాకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ బోర్డు ప్రకటన చేశారు. కేంద్రం నుంచి గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించి బోర్డు పనులను ప్రారంభించేందుకు చర్యలను చేపట్టారు. పసుపు ఎగుమతులపై కూడా దృష్టి పెట్టారు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన గడువు ముగిసే సమయంలో బోర్డు ఏర్పాటును ప్రకటించారు. బోర్డుతో పాటు పసుపు పరిశోధన కేంద్రానికి కూడా నిధులు ఇస్తామని హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. శాసనసభ ఎన్నికల్లో ఈ ప్రకటన పనిచేయడం వల్ల ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్‌లో సీట్లను గెలుచుకోగా మిగతా ఐదు నియోజకవర్గాల్లో భారీ ఓట్లను పార్టీ సాధించింది. ఆ ఎన్నికల్లో ప్రధాని, హోం మంత్రి పర్యటనలు, పసుపు బోర్డు ప్రకటన ఉపయోగపడింది. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలను కలిపి 3లక్షల 65వేల 374ఓట్లను సాధించింది. పార్లమెంట్ పరిధిలో మూడు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్, రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలుచుకున్నా పోలైన ఓట్లలో రెండో స్థానంలో నిలిచింది. ఈ దఫా కూడా పార్లమెంట్ ఎన్నికల్లో పసుపు రైతుల సమస్యలు కలిసివస్తాయని ఎంపీ అర్వింద్ భావిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో పర్యటిస్తూ పసుపు బోర్డు అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. ట్రేడర్లతో సమావేశం నిర్వహించడంతో పాటు ధర పెరిగే విధంగా చూడాలని కోరుతున్నారు. కేంద్రం ఎగుమతులపై దృష్టి పెట్టడం వల్ల పసుపునకు డిమాండ్ పెరుగుతుండడంతో ధర వస్తుంది. ఈ ఎన్నికల్లో కూడా పసుపు అంశాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేసేందుకు బీజేపీ శ్రేణులు సిద్ధమవుతున్నారు.

కాంగ్రెస్‌కు కలిసి వచ్చిన పసుపు రైతుల సమస్యలు

ఇదే పసుపు అంశాన్ని శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ప్రచారానికి వాడుకున్నారు. తాము అధికారంలోకి వస్తే పసుపు రైతులకు అండగా ఉంటామని ప్రకటించారు. పసుపు ధరను పెంచడంతో పాటు అవసరమైతే ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చూస్తామని ప్రకటనలు చేశారు. ఈ అంశం కూడా ఆ పార్టీకి కలిసివచ్చింది. నిజామాబాద్ రూరల్, బోధన్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలువగా మిగతా నియోజకవర్గాల్లో గణనీయమైన ఓట్లను సాధించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పసుపు రైతులపై దృష్టి పెడుతున్నారు. ధర వచ్చే విధంగా ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు వస్తూ ఉండడంతో ధర తగ్గకుండా ఉండే విధంగా చర్యలకు సిద్ధమవుతున్నారు. జిల్లాకు చెందిన రైతునేతలు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకువెళ్లడంతో కలెక్టర్ ఆధ్వర్యంలో వ్యాపారులు, అధికారులు, రైతు సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. ధరలు తగ్గకుండా చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఐదు నియోజకవర్గాలైన నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల పరిధిలో పసుపు సాగు ఎక్కువగా ఉంది. రైతులు కూడా ఎక్కువగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో పసుపు అంశం తమకు కలిసివస్తుందని భావిస్తున్న కాంగ్రెస్ నేతలు ఎజెండాగా చేసుకుని ముందుకు పోతున్నారు. ఎన్నికల ప్రచారంలో కూడా పసుపు రైతుల కోసం ప్రభుత్వం ఏం చర్యలు చేపట్టనుందో వివరించేందుకు ఆ పార్టీ నేతలు సిద్ధమవుతున్నారు.

అనుకూలంగా మలుచుకునేందుకు బీఆర్‌ఎస్ యత్నం

కాంగ్రెస్, బీజేపీ నేతలే పసుపు రైతుల సమస్యలను ఎజెండగా చేసుకుని పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమవుతుండగా బీఆర్‌ఎస్ నేతలు కూడా తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నేతలు ఇచ్చిన హామీలతో పాటు శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలు, అమలుపై దృష్టిపెట్టి ప్రచారం చేసేందుకు సిద్ధమవుతున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో మూడు పార్టీల నేతలు సిద్ధమవుతుండగా పసుపు రైతులు మాత్రం ఈదఫా ఏవైపు మొగ్గుతారో స్పష్టం చేయడం లేదు. ఏళ్ల తరబడి ఆందోళనలు నిర్వహించినా ధరలు పెరగకపోవడం వల్ల నష్టాలపాలైన రైతులు సాగును తగ్గించారు. జిల్లాలో 40వేల ఎకరాలకు పైగా ప్రతి సంవత్సరం సాగయ్యే పసుపు ప్రస్తుతం 19వేల ఎకరాలకు చేరింది. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా ఉన్నా ధరలు లేకపోవడం వల్ల రైతులు పంటను తగ్గించారు. ఏటా పెట్టుబడులు పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల పసుపు సాగును తగ్గించారు. ఈ ఎన్నికల్లో కూడా వారు ఏ పార్టీవైపు మొగ్గుచూపితే ఆ పార్టీ అభ్యర్థులు పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచే అవకాశం ఉంది.



● చేపల మార్కెట్‌కు కేటాయించిన స్థలం ఇదే..



● చేపలు విక్రయించే స్టాల్

చేపల మార్కెట్ కలేనా?

- నాడు మాజీ మంత్రి చేతుల మీదుగా ఘనంగా శంకుస్థాపన
- ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోని నిర్మాణ పనులు
- మత్స్యకార్మికులకు వ్యాపారానికి తప్పని అవస్థలు

డిచ్‌పల్లి, జనవరి 30: మండల కేంద్రంలో రూ.50లక్షలతో (నీలివిప్లవం స్కీం) చేపల మార్కెట్ నిర్మించాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా గత ఏడాది సెప్టెంబరు14న ఘనంగా శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనుల ఊసే లేకపోవడంతో శిలాఫలకం వెక్కిరిస్తుంది. దీంతో చేపల మార్కెట్ కలగానే మారిందని మత్స్యకారులు వాపోతున్నారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావిడిగా శంకుస్థాప చేశారు. దీని కోసం చెరువుకట్టపై ఖాళీ ప్రదేశాన్ని చదునుచేయించారు. నిర్మాణ పనులు ప్రారంభం కాకముందే చేపల విక్రయం స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కానీ నిర్మాణ పనులు మాత్రం ప్రారంభకాకపోవడంతో మత్స్యకార్మికులు ఆందోళన చెందుతున్నారు. చేపల విక్రయాలకు కనీస వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. డిచ్‌పల్లి మార్కెట్‌లో రోడ్డు పక్కన చేపల విక్రయాలు కొనసాగిస్తూ తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మూత్రశాలలు, తాగు నీరు వంటి వసతులు లేక అవస్థలు పడుతున్నారు. ప్రతి ఆదివారం డిచ్‌పల్లిలో చేపల విక్రయాలు అధికంగా జరుగుతుంటాయి. నిజామాబాద్, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి, మోపాల్ చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు ఈ మార్కెట్‌కు వస్తుంటారు. బుధవారం వారసంతతో ఈ చేపల మార్కెట్ రద్దీగా ఉంటుంది. అయితే మార్కెట్‌లో కనీస వసతులు లేక వ్యాపారస్థులు, వినియోగదారులు ఇబ్బందిపడుతున్నారు. రాష్ట్రంలో నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఈ పనులు ప్రారంభిస్తారో లేదో అని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డి స్పందించి చేపల మార్కెట్‌ను నిర్మించి మత్స్య కార్మికులకు, వ్యాపారులకు న్యాయం చేయాలని, కోరుతున్నారు.



● శంకుస్థాపన చేస్తున్న నాటి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ (ఫైల్)

సీఐడీ అదుపులో స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై

● నకిలీ పత్రాలతో పాస్‌పోర్టులు సృష్టించిన కేసులో విచారించనున్న అధికారులు

ఖిల్లా, జనవరి 30: నకిలీ పత్రాలతో పాస్‌పోర్టులు సృష్టించిన కేసులో జిల్లా పోలీసు శాఖ స్పెషల్ బ్రాంచ్ విభాగంలో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మణ్‌ను సీఐడీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని గంగాస్థాన్‌లో నివాసం ఉంటున్న లక్ష్మణ్‌ను సీఐడీ అధికారులు విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నారు. లక్ష్మణ్ ప్రస్తుతం మాక్లూర్, నవీపేట పోలీసు స్టేషన్ల పరిధిలో ఎస్బీ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఇప్పటికే నకిలీ పాస్‌పోర్ట్ పత్రాలు సృష్టిస్తున్నట్లు అభియోగాలు ఉన్న భీంగల్‌కు చెందిన సుభాష్ అనే ఏజెంట్‌ను సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. సుభాష్‌ను విచారించిన పోలీసులు దీనివెనక ఉన్నవారి గురించి వివరాలను సేకరించారు. ఆయన ఇచ్చిన సమాచారం మేరకే లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. బోధన్ పట్టణం కేంద్రంగా 2021లో ఎస్‌బీ ఎస్‌ఐ మల్లేష్ ఇంటి పేరిట సుమారు 70మంది పాస్‌పోర్టులు తీసుకున్నట్లు గుర్తించిన పోలీసులు మూడేళ్ల తర్వాత మరోసారి నకిలీ పత్రాలతో పాస్‌పోర్టులు జారీ చేస్తున్నట్లుగా తెలుసుకున్నారు. అప్పటి నుంచి పాస్‌పోర్టులు తయారు చేసే ఏజెంట్లపై నిఘా పటిష్ఠం చేశారు.

డెమోన్‌స్ట్రేషన్ సెంటర్ల కోసం ఈవీఎంల కేటాయింపు

● పర్యవేక్షించిన కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్, జనవరి 30: త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వీలుగా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిల్లో ఏర్పాటు చేయనున్న డెమోన్‌స్ట్రేషన్ సెంటర్ల ప్రయోగాత్మక పరిశీలనకు వీలుగా మంగళవారం ఈవీఎంలను కేటాయించారు. జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాం నుంచి జిల్లా పరిధిలోని ఆయా నియోజక వర్గాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్‌లను తరలించారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డిల పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ఈ ప్రక్రియ నిర్వహించారు. పోలీసు బందోబస్త్ మధ్య సంబంధి సెగ్మెంట్ల అధికారులు ఈవీఎంలను తమ వెంట తీసుకెళ్లారు. ఈవీఎం గోదాంలోనే వాటి పనితీరును క్షుణ్ణంగా పరిశీలన జరిపిన తర్వాతనే అధికారులకు అందజేశారు. ప్రజలు ఈ అవగాహన కేంద్రాలను సందర్శించి ఓటింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవడంతో పాటు ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పనితీరుపై ఏవైన సందేహాలు ఉంటే నివృత్తి చేసుకునేందుకు వీలుగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను కేటాయించామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, అగ్నిమాపక శాఖాధికారి నర్సింగ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.



● ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్



● మాట్లాడుతున్న అన్వేష్ రెడ్డి

ఎన్నికల సమయంలోనే రైతులు గుర్తుకు వస్తారు

- ఎంపీ అర్వింద్ పసుపు రైతులకు హామీ ఇచ్చి మోసం చేశాడు
- విలేకరుల సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ సెల్ రాష్ట్ర చైర్మన్ అన్వేష్ రెడ్డి

నిజామాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల సమయంలోనే పసుపు రైతులు ఎంపీ అర్వింద్‌కు గుర్తుకు వస్తారని, రాజకీయంగా రైతులను ఐదేళ్లుగా ఉపయోగించుకుంటున్నాడని కిసాన్ కాంగ్రెస్ సెల్ రాష్ట్ర చైర్మన్ అన్వేష్ రెడ్డి ఆరోపించారు. నగరంలోని కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులు, వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంపీ నిర్వాకం వల్లే పసుపు సాగు భారీగా తగ్గిపోయిందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో పసుపు బోర్డు తెస్తానని చెప్పి బాండ్‌పేపర్ రాసిచ్చి మోసం చేసాడన్నారు. జిల్లాలో 40వేల ఎకరాలకు పైగా సాగయ్యే పసుపు ఈసంవత్సరం కేవలం 19వేల ఎకరాల్లోపే సాగైందన్నారు. గత ఐదేళ్లలో పసుపు రైతులను పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ఎన్నికలు వచ్చే ముందు పసుపుబోర్డు ప్రకటన చేసారన్నారు. ఇంతకీ పసుపుబోర్డు ఎక్కడ పెడుతున్నారో ఇప్పటి వరకు స్పష్టం చేయలేదన్నారు. పసుపు బోర్డుతో పాటు పరిశోధన కేంద్రాన్ని కూడా తీసుకొస్తామని చెప్పిన ఎంపీ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో కేంద్రం నుంచి స్పష్టత ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పసుపు రైతులను ఆదుకునేందుకు అన్నిరకాల చర్యలను చేపట్టిందన్నారు. జిల్లాలోని పసుపు రైతుల సమస్యలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్తే ఆయన కలెక్టర్‌తో మాట్లాడారన్నారు. ఆయన ఆదేశాలకనుగుణంగానే వ్యాపారులు, రైతుసంఘాలు అధికారులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారన్నారు. పంట విస్తీర్ణం తగ్గిందని, దిగుబడికూడా బాగా తగ్గిపోయిందని ప్రస్తుతం వస్తున్న ధరనే కొనసాగించాలని సమావేశంలో వ్యాపారులను కోరామన్నారు. ప్రభుత్వం తరఫున కూడా కావాల్సిన చర్యలను చేపడుతున్నామని అన్వేష్ రెడ్డి తెలిపారు.

పసుపు విక్రయాలపై సమావేశం

జిల్లా కలెక్టరేట్‌లో పసుపు అమ్మకాల పై మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో అధనపు కలెక్టర్ యాదిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి వెంకటేశం, మార్కెటింగ్ శాఖ ఏడీ గంగుబాయి, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి నర్సింగ్‌దాస్, ఐక్య కార్యాచరణ రైతు నేతలు అన్వేష్ రెడ్డి, వి.ప్రభాకర్, మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్, కమల్‌కిషోర్‌తో పాటు ఇతర వ్యాపారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్‌కు ప్రతిరోజూ వస్తున్న పసుపు వాటికి వస్తున్న ధర కొద్దిరోజుల్లో ఎక్కువ మొత్తంలో రానున్న పసుపు పైన చర్చించారు. ప్రస్తుతం మార్కెట్‌లో పసుపుకు క్వింటాలు 9వేల నుంచి 11వేల మధ్య ధర వస్తుందని చర్చించారు. ఈ ధర తగ్గకుండా చూడడంతో పాటు సీజన్‌లో డిమాండ్‌కు అనుగుణంగా పెరిగే విధంగా చూడాలని వ్యాపారులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పసుపు రైతులను ఆదుకునేందుకు సిద్దంగా ఉందని వ్యాపారులకు కావాల్సిన సహాయసహకారాలు అందిస్తామని ధర మాత్రం యథావిధిగా ఉండేవిధంగా చూడాలని సమావేశంలో చర్చించారు. ఏరోజు వచ్చే పసుపును ఆరోజే అమ్మకాలు జరిగే విధంగా చూడడంతో పాటు రైతులకు డబ్బులు వెంటనే ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలను కలెక్టర్ ఇచ్చారు. రైతులకు ఆరబోసిన పసుపే తీసుకువచ్చే విధంగా గ్రామాల్లో అవగాహన కల్పించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

వివాహేతర సంబంధంతోనే హత్య : డీఎస్పీ

తాడ్వాయి, జనవరి 30: తాడ్వాయి మండలం సోమారం గ్రామశివారులో ఈనెల 22న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధం కారణంగానే హత్య జరిగినట్లు పోలీసులు తెల్పారు. వివాహేతర సంబంధం పెట్టుకున్న తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన కురుకంటి మనోహర్‌రెడ్డి పథకం ప్రకారం ముదాం శంకర్‌ను హత్య చేయించారు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు వివరాల ప్రకారం.. తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన సూర్కంటి మనోహర్‌రెడ్డి మృతుడు ముదాం శంకర్ భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. గత కొన్ని సంవత్సరాల నుంచి మనోహర్‌రెడ్డి మృతుడు భార్యలక్ష్మితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. మృతుడి భార్యలక్ష్మీ తన భర్త శంకర్‌ను అడ్డు తొలగించుకోవాలని ఎలాగైన హతమార్చాలని మనోహర్‌రెడ్డికి తెలిపింది. మనోహర్ రెడ్డి పక్క ప్రణాళికతో సోమారం గ్రామానికి చెందిన జింక శ్రీనివాస్, అతని భార్య యాదమ్మతో చర్చలు జరిపారు. శంకర్‌ను హతమారిస్తే మీకు పెద్ద మొత్తంలో డబ్బులు అందిస్తామని ఎర చూపారు. డబ్బులు అవసరమైన శ్రీనివాస్ ఈ ఒప్పందం కుదుర్చుకున్నాడు. పక్క ప్రణాళికతో ఈనెల 21న రాత్రి సోమారం శివారులోని సిద్దుల గుట్ట ప్రాంతానికి పిలిపించుకున్నాడు. జింక శ్రీనివాస్ అతని భార్య యాదమ్మలు కలిసి ఇనుపరాడ్డుతో తలపై కొట్టగా శంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంతకముందే నేరస్తుడైన మనోహర్ రెడ్డి పథకం ప్రకారం ముందస్తుగా ముదాం శంకర్‌పై ఇన్సూరెన్స్ పాలసీలు చేయించాడు. శంకర్ మృతిచెందితే రూ.50లక్షలు వరకు రావాలని ప్రణాళిక చేసుకున్నాడు. ఇందులో జింక శ్రీనివాస్‌కు డబ్బులు అందిస్తామని తెలిపారు. డబ్బులు కోసం ఆశపడ్డ శ్రీనివాస్ పథకం వేసుకుని హతమార్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు రెండు స్పెషల్ టీంలను ఏర్పాటుచేసి నిందితులను పట్టుకున్నామన్నారు. మంగళవారం కామారెడ్డి కొత్తబస్టాండ్‌ఏరియాలో నిందితులు తిరుగుతున్నట్లు తమకు సమాచారం వచ్చిందని, వెంటనే వెళ్లి నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. హత్యకేసులో సురకంటి మనోహర్ రెడ్డి, ముదాం లక్ష్మీ, జింక శ్రీనివాస్, జింక్ యాదమ్మలను అరెస్టు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సదాశివనగర్ సీఐ రామన్, తాడ్వాయి ఎస్ఐ ఆంజనేయులు, ఏఎస్ఐ సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

స్వాతంత్ర్య అమరవీరులకు ఘన నివాళి

నిజామాబాద్ అర్బన్, జనవరి 30: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగధనులను స్మరించుకుంటూ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘన నివాళ్లు అర్పించారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నేతృత్వంలో సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని స్వాతంత్ర్యోద్యమ అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని దృఢ సంకల్పంతో వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● 'అమరవీరుల సేవలు మరువలేనివి'

ఖిల్లా: స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగాలు మరువలేనివని అదనపు డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీసు(లా అండ్ ఆర్డర్) జయరాం అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అమరులైన వారి జ్ఞాపకార్థం పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగనేవార్ ఆదేశాల మేరకు పోలీసు పరేడ్ మైదానంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసి అసువులు బాసిన అమర వీరుల సేవలు మరువలేనివన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వారికి మౌనం పాటించి నివాళ్లు అర్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రొబేషనరీ ఐపిఎస్. బి.చైతన్యరెడ్డి, పోలీసు యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సరళ, ఆఫీసు సూపరింటెండెంట్‌లు, పోలీసు కార్యాలయ సిబ్బంది, సీసీఆర్‌బి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అధికారులు

గృహజ్యోతిని ఎప్పుడు అమలు చేస్తారు?

● మండల సర్వసభ్య సమావేశంలో నిలదీత

ధర్పల్లి, జనవరి 30: గృహజ్యోతి పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారని ఎంపీటీసీలు, సర్పంచులు అధికారులను నిలదీశారు.మంగళవారం ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు నిరుపేదలకు 200ల యూనిట్ల విద్యుత్‌ను అందించే గృహజ్యోతి పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారని ఎంపీటీసీలు విద్యుత్ అధికారిని నిలదీ శారు. దుబ్బాక ఎంపీటీసీ గంగాధర్ మాట్లాడుతూ గ్రామంలో లైన్‌మెన్ విధుల్లో నిరక్ష్యం వహిస్తు న్నాడని సభ దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుం టామని మండల సభకు వచ్చిన విద్యుత్ అధికారి లైన్ ఇన్స్‌పెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు. సర్పంచుల పదవి కాలం ముగియడం తో ఎంపీపీ సారికహన్మంతు, ఎంపీడీవో లక్ష్మణ్ వారిని సన్మానిం చారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ మాలతి మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరి పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు.

రోడ్డు విస్తరణ సర్వే పనుల పరిశీలన

ఆర్మూర్‌రూరల్, జనవరి30: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటా ర్మూర్ 63వ జాతీయరహదారి నుంచి లక్కోర గ్రామం వరకు చే పట్టనున్న విస్తరణ పనుల సర్వేను ఆర్డీవో వినోద్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనుల్లో భూసేకరణ ఏ మేరకు అవసర ముందో అన్న విషయంపై పరిశీలన జరిపారు.ఈకార్యక్రమంలో ఆర్మూర్ తహసీల్దార్ శ్రీకాంత్,పాల్గొన్నారు.



బోధన్‌లో కత్తిపోట్ల కలకలం

● ముగ్గురికి గాయాలు ● ఒకరి పరిస్థితి విషమం

బోధన్ రూరల్, జనవరి 30: బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో గల అనీసా నగర్ కాలనీలో సోమవారం అర్ధరాత్రి యువకుల మధ్య జరిగిన చిన్న పాటి ఘర్షణ కత్తిపోట్లకు దారి తీసింది. పట్టణంలో అర్ధరాత్రి జరిగిన కత్తిపోట్లు కలకలం రేపాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆచన్‌పల్లిలోని అనీసా గర్‌కు చెందిన సోహెల్, సోహెబ్‌లు అన్నదమ్ముళ్ళు. సోహెబ్‌కు అదే కాలనీకి చెందిన అబ్దుల్ వాసేతో చిన్న పాటి వివాదం చోటు చేసుకుంది. మాట్లాడుకుందామని అబ్దుల్ వాసే తన సన్నిహితుడు ఇలియాస్, తన్వీర్‌లతో కలిసి పిలిపించారు. మాట్లాడటానికి సోహెబ్‌తో పాటు సోహెల్ కూడా చేరుకున్నారు. వీరందరి మధ్య చిన్న పాటి వివాదం మొదలై కత్తి పోట్ల వరకు దారి తీసింది. ఒకరిపై ఒకరు ఘర్షణనకు దిగారు. ఇలియాస్ అనే వ్యక్తి కత్తితో సోహెల్ మీద దాడి చేయడంతో అతని వీపు వెనుక బాగం, షోల్డర్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో తన్వీర్ అడ్డుపడటంతో తన్వీర్ ఛాతి కింది భాగంలో కత్తితో గాయాలయ్యాయి. సోహెబ్‌కు సైతం గాయాల య్యాయి. కత్తి పోట్ల విషయం తెలుసుకున్న పోలీసు లు ఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రు లను చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసు పత్రికి తరలించారు. తీవ్ర రక్తస్రావం కావడంతో తన్వీర్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. సోహెల్ తీవ్రంగా గాయప డటంతో చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలిం చారు. సోహెబ్‌ను చికిత్స అనంతరం ఇంటికి పంపిం చారు. ఘర్షణకు పాల్పడిన వారంతా 25 సంవత్సరాల లోపు ఉన్న యువకులే. వీరందరూ సెంట్రింగ్, ఇతర పనులు చేస్తుంటారు. యువకుల మధ్య జరిగిన చిన్నపాటి గొడవ కత్తి పోట్లకు దారి తీయడం తీవ్ర కలకలం రేపింది. బోధన్ సీఐ వీరయ్య కత్తి పోట్లకు గల కారణలను ఆరాతీస్తున్నారు. కత్తిపోట్లకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుంటా మని, ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవన్నారు. గాయపడ్డ యువ కుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశామన్నారు.

● ఇదెక్కడి విష సంస్కృతి

చిన్నపాటి గొడవలు, వివాదాలు ఇలా కత్తిపోట్లకు దారి తీయడంపై పట్టణ ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. ఇలాంటి విష సంస్కృతిని యువత విడనాడాలి.తల్వార్, జంబియాలు వంటి మారణాయుధాలయు యువకుల వద్దకు ఎలా వస్తున్నాయని పోలీసులు అన్ని కోణాల్లో చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. యువత సన్మార్గంలో కాకుండా ప్రమాదకర మార్గాల్లో పయణిస్తుం దన్నారు. యువత సమన్వయం కోల్పోయి ఇలా కత్తులతో పొడుచుకో వడం సరికాదని ఇదెక్కడి సంస్కృతి అని ప్రజలు వాపోతున్నారు. గత కొన్ని నెలల క్రితం బర్త్‌డే వేడుకల్లో తల్వార్‌లతో బోధన్‌లో కేక్‌లు కట్ చేసిన ఘటనలు కూడా ఉన్నాయి.ఇలా యువత పక్కదారి పడుతోం ది. అల్లరి మూకలు,రౌడీలుగా తయారవుతున్నారు.ఇకనైనా పోలీసులు సంబంధిత శైలిలో యువకులను మేలు కోల్పాలని, విష సంస్కృతిని విడనాడేలా యువకులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చేతికి వచ్చిన కొడుకులు ఇలా ఆసుపత్రుల్లో గా యా లతో కొన ఊపిరితో ఉన్న వారిని చూసి కన్నతల్లి దం డ్రుల రోదనలు ఆపడం ఎవరి తరం కావడం లేదు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా పోలీసులు రాత్రులు పెట్రోలింగ్ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



ఆసుపత్రి వద్ద గుమ్మిగూడిన జనం

కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదలకు న్యాయం : రూరల్ ఎమ్మెల్యే

ఇందల్‌వాయి, జనవరి 30:కాంగ్రెస్ పార్టీతోనే పేద మధ్య తరగతి ప్రజలకు న్యాయం జరుగుతుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని గౌరారం గ్రామంలో మంగళవారం పర్యటించిన ఆయనకు మహిళలు మంగళహారతులు, బోనాలు, వల గొడుగుతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వంద రోజుల్లోనే అమలు చేస్తుందని, 50రోజుల్లో రెండు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. రూరల్ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను విడతల వారిగా అన్ని పరిష్కరిస్తామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో అభయహస్తం ద్వారా దరఖాస్తులు చేసుకున్న ప్రతి లబ్ధిదారునికి పథకాలు అందే విధంగా కృషి చేస్తానని హామి ఇచ్చారు. రానున్న ఐదేళ్లలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానని, గత ప్రభుత్వంలోని నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని గుర్తు చేశారు. మిషన్‌భగీరథ పథకం ద్వారా తెస్తున్న నీటిని గ్రామాల్లో ఏ ఒక్కరు తాగడం లేదని విమర్శించారు. గౌరారం గ్రామంలో 180సర్వే నంబరులో గల భూములకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని అన్నారు. గ్రామంలోని రెండు చెక్‌డ్యాములకు ప్రతిపాదనలు పంపామని వాటికి త్వరలోనే నిర్మాణ పనులు చేపడ్తామన్నారు. కుల సంఘాలకు భవన నిర్మాణాలకు కృషి చేస్తానని హామి ఇచ్చారు.ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యేకు ధర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడిగోపి గ్రామాభివృద్ధి సభ్యులు శాలువ పూలమాల లతో ఘనంగా సన్మానించారు. పాలక వర్గం పదవి కాలం త్వరలోనే ముగియనుండడంతో పాలక వర్గం సభ్యులకు, గ్రామపంచాయతీ సిబ్బందికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, మెమెంటోలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా కిసాన్‌కేత్ అధ్యక్షుడు ముప్పాగంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, వెంకటరెడ్డి, సంతోష్‌రెడ్డి, సుధాకర్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.



.సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

బాల్కొండలో వీడ్కోలు సమావేశం

ముప్కాల్, జనవరి30: నేటితో పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం ముగియనుడడంతో మంగళవారం సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులను ఘనంగా సత్కరిం చారు. అంతకు ముందు మహాత్మగాంధీ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులు, కార్య దర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్న టిప్పర్లు, జేసీబీ పట్టివేత

మోస్రా,జనవరి30: మోస్రా మండలంలోని చే నెంబర్ తండాలో అక్రమంగా మొరం తరలిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. మొరం తరలిస్తున్న నాలుగు టిప్పర్లు, ఒక జేసీబీని పట్టుకుని సీజ్ చేశారు. టిప్పర్లు, జేసీబీని వర్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్‌ఐ కృష్ణ కుమార్‌ను వివరణ కోరగా జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకుని తమకు అప్పగించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ సాయిలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

ముప్కాల్, జనవరి30: బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామానికి చెందిన పిల్లి సంజయ్ అనే వ్యక్తి మొబైల్ ఫోన్ ఈనెల 26న బాల్కొండ క్రీడా మైదానంలో పడిపోగా మంగళవారం ఎస్సై గోపిబాధితునికి అందజేశాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చోరీకి గురైన ఫోన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను రికవరీ చేసి ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జక్రాన్‌పల్లి, జనవరి30: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సైతిరుపతి అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని సికింద్రాపూర్ గ్రామంలో సైబర్ నేరాలు, గంజాయి, ట్రాఫిక్ నిబంధనలపై ఎస్సై సీహెచ్.తిరుపతి యువకులకు, గ్రామస్థు లకు అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో ఎంపీ సీట్లను గెలుచుకోవాలి

ఆర్మూర్‌రూరల్, జనవరి30: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో ఎంపీ సీట్లు అధికంగా గెలుచుకోవాలని ఇందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని ఎంఆర్ గార్డెన్‌లో బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న క్లస్టర్ యాత్ర సన్నహక సమావేశం జరిగింది. ఈసందర్భంగా ప్రదీప్‌కుమార్, యాత్ర ప్రముఖ్ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల మీదుగా త్వరలో జరిగే బస్సు యాత్ర, పార్టీ బలోపేతంకై దృష్టి సారించి బూత్ స్థాయి నుంచి ప్రతీఒక్కరు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు, వివిధ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి, కన్వీనర్‌లు, కోకన్వీనర్‌లు, పాల్గొన్నారు.

చెరువులో మునిగి బాలుడి మృతి

ఇందల్‌వాయి,జనవరి 30:పోలీసు స్టేషన్ పరిధిలోని మేగ్యానాయక్ తండాకు చెందిన శ్రీనాథ్(16)అనే బాలుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. సోమవారం పశువులు మేపేందుకు నల్లవెల్లి గ్రామ శివారులోని తిరుమలయ్య చెరువు వద్దకు వెళ్లిన శ్రీనాథ్ సరదాగా చేపలు పట్టేందుకు చెరువులోకి దిగగా జేసీపీ ద్వారా తీసిన గుంతలో బాలుడు అదృశ్యమయ్యాడని విషయం తెలుసుకున్న స్థానికులు చెరువు వద్ద గాలించగా బాలుడి ఆచూకీ లభించక పోవడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గజ ఈతగాళ్లను పిలిపించి రాత్రి పది గంటల వరకు గాలించగా శ్రీనాథ్ మృతదేహం లభించిందని,మృతదేహాన్ని పంచనామ నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడు శ్రీనాథ్ ఇంటర్ చదువుతున్నట్లు తెలిసింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. బాలుడి అంత్యక్రియలను మేగ్యా నాయక్‌తాండలో నిర్వహించారు.

చెన్నై వెళ్లిన ఎస్‌ఎఫ్‌ఐ బృందం

నిజామాబాద్‌అర్బన్, జనవరి 30:దక్షిణాది రాష్ట్రాల్లో నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా బృందం మంగళవారం చెన్నై బయలుదేరింది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాదర్శి అనిల్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం వల్ల దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అనేక ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఇది విపత్తుగా మారిందన్నారు. నూతన జాతీయ విద్యావిధానం ప్రైవేటీకరణకు, కార్పోరేటీకరణకు వత్తాసు పలుకుతుందన్నారు. దేశవ్యాప్తంగా 16విద్యార్థి సంఘాలు జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ రాబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కెటాయించాలన్నారు. చెన్నై వెళ్లిన వారిలో నాయకులు నాగరాజు, మహేష్, దీపిక, వేణు, జవహర్, పూజ తదితరులు ఉన్నారు.

అమీర్‌నగర్‌లో 9వ తరగతి ప్రారంభం

కమ్మర్‌పల్లి జనవరి 30: మండంలోని అమీర్‌నగర్ ప్రాథమిక పాఠశాలను ఉన్నతపాఠశాలగా మారుస్తు రాష్ట్ర ఉన్నత విద్యశాఖ నుంచి అనుమతులు రావడంతో మంగళవారం పాఠశాలలో 9వ తరగతిని మండల విద్యాశాఖ అధికారి ఎన్ ఆంధ్రయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుప్పాల గంగాధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేల్ల శ్రీనివాస్, వీడీసీ గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రీడలో గెలుపోటములను సహజం

గాంధారి, జనవరి 30: క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమని ఓడిపో యిన వాళ్లు నిరాశ చెందకుండా గెలుపు కోసం కృషిచేయాలని మెదక్ డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన వాలీ బాల్ టోర్నమెంట్‌లో ప్రథమ విజేతగా నిలిచిన తాడ్వాయి జట్టును అభి నందించి రూ.30 వేల నగదును అందించారు. రెండో బహుమతి గాంధారి మండలం వెనుకతండా రూ.20 వేల నగదును అందించారు. మూడో బహు మతి మోతె వాలీబాల్ క్రీడాకారులకు రూ.10 వేలు అందించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వాలిబాల్ లాంటి క్రీడాలకు క్రీడాకారులకు ప్రో త్సాహం రానున్న రోజుల్లో వాలిబాల్ క్రీడల్లో మన జహీరాబాద్ పార్లమెంట్ నుండి జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిం చాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో బాగారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో అనేకసేవకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

హనుమాన్ చాలీసా పారాయణం

ఆర్మూర్‌టౌన్,జనవరి30: పట్టణంలోని జర్నలిస్టుకాలనీలో హనుమాన్ మం దిరంలో ఆలయ కమటీ ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ చాలిసా పారా యణం చేశారు. కాలనీవాసులు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి జై హనుమాన్ అని నినాదాలు చేస్తూ హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల శివరాజ్‌కుమార్, కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, నర్సయ్య, భూమయ్య, శంకర్, ఎల్‌టి.కుమార్, సాయన్న, జీవన్, ముత్తెన్న, రవి, సాయిలు, నారాయణ, తదిత రులు పాల్గొన్నారు.

సుద్దులంలో ఉచిత పశువైద్య శిబిరం

కోటగిరి,జనవరి30: కోటగిరి మండలంలోని సుద్దులం గ్రామంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ సాయిలు ప్రారంభించారు. పశువైద్య శిబిరంలో 8పశువులకు గర్భ నిర్ధారణ, 14 పశువులకు గర్భకోశ చికిత్సలు, 40పశువులకు సాధారణ చికిత్సలు, 32దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. జంతు సంక్షేమ పక్షోత్సవాలలో భాగంగా పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రెబీస్ టీకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాధిక, పశువైద్యులు సురేష్ కుమార్, సంతోష్, జూనియర్ డాక్టర్లు సిబ్బంది, గోపాల మిత్ర పర్యవేక్షకులు గోపాల మిత్రలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన గల్ఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

నిజామాబాద్‌అర్బన్, జనవరి 30:గల్ఫ్ కార్మికుల సమస్యలు, ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గల్ఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతును కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని గల్ఫ్ కార్మికుల సమస్యలు, నకిలీ ఏజెంట్లు గల్ఫ్‌కార్మికులను మోసం చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అసోసియేషన్‌తో సంబంధం ఉన్న ఏజెంట్ల ద్వారానే వీసాలను ధరఖాస్తు చేసుకోవాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో అధ్యక్షుడు పోశెట్టి, కార్యదర్శి విజయరావ్, ఉపాధ్యాక్షుడు తదితరులు పాల్గొన్నారు.





'కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు మాజీ ఎమ్మెల్యేకు లేదు'

బిచ్కుంద, జనవరి 30: ప్రజా ఆశీర్వాదంతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండేకు లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లిఖార్జున్ అప్పశెట్కార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రెండు నెలల కాంగ్రెస్ ప్రభుత్వంపై నోటికొచ్చినట్లు మాట్లాడడం సమంజసం కాదని 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోని ఏ ఒక్క హామీని కూడా అమలు పరిచలేదని అన్నారు. వెనుకబడిన జుక్కల్ నియోజకవర్గంలో 15 సంవత్సరాలుగా ఎమ్మెల్యే అయి ఉండి డబుల్‌బెడ్‌రూంలు ఎందుకు కట్టలేదో చెప్పాలని గొప్పల కోసం బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల నుంచి వంద పడకలకు మార్చారని వైద్యులు సిబ్బందిని మాత్రం మంజూరు చేయించలేదని అన్నారు. మాజీ ఎమ్మెల్యేరోడ్డు లేని గ్రామాల పరిశీలనకు రావాలన్నారు. చాలావరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే రోడ్లు, ప్రభుత్వ భవనాలు, తాగునీటి సౌకర్యాల ట్యాంకులు నిర్మాణం చేసినవి ఉన్నాయని వాటికి రంగులు పూసి మిషన్ భగీరథ అని పేర్లురాసుకోవడం సిగ్గుచేటు అన్నారు.బిచ్కుంద పట్టణంలో ఎన్నికలకు ముందు ఓట్లకోసం అగ్రిమెంట్ కాకుండా సెంట్రల్ లైటింగ్ పనుల కోసం అంటూ దుకాణ సముదాయాల ముందు రోడ్లను తవ్వకాలు జరిపి అర్థాంతరంగా నిలిపివేయడంతో రోడ్డుపై విపరీతంగా దుమ్ములేచి ప్రజలకు ఇబ్బంది పడుతున్నట్లు ఆయన విమర్శించారు. ఇబ్బందికరమైన మాటలను మానుకొని అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.ఈ కార్యక్రఽంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్రాంరెడ్డి, నాగనాథ్, కాంగ్రెస్ పార్టీమండల అధ్యక్షుడు గంగాధర్, నౌషానాయక్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



బాధిత కుటుంబాలకు చెక్ అందిస్తున్న సీపీ

ఖిల్లా, జనవరి 30:పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ మరణించిన సిబ్బంది కుటుంబానికి ఆర్థిక సహాయం చెక్కును పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌శింగేనేవార్ అందించారు. మంగళవారం సీపీ కార్యాలయంలో బాధిత కుటుంబానికి రూ. 30లక్షల చెక్కును అందించారు. బాల్కొండ పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న జలందర్ ద్విచక్రవాహనంపై 9 ఆగస్టునాడు పోలీసు స్టేషన్‌కు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనగా మృతి చెందాడు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ద్వారా వచ్చిన ప్రమాద బీమా చెక్‌ను మృతుడి సతీమణి అర్చనకు సీపీ అందించారు. ఈ సందర్భంగా అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు (లా అండ్ ఆర్డర్) ఎస్. జయరాం, ప్రొబెషనరీ ఐపీఎస్.చైతన్యరెడ్డి, హోంగార్డ్స్ ఏసీపీ. పి.అరుణ్‌కుమార్, బాల్కొండ ఎస్‌ఐ గోపి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ గంగాధర్, సాలరీ మేనేజర్ సంపత్‌రెడ్డి, ఇతర పోలీసు సిబ్బంది ఉన్నారు.

మధ్యాహ్న భోజన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

నిజామాబాద్‌అర్బన్,జనవరి 30: ఫిబ్రవరి 16న జరిగే మధ్యాహ్నభోజన కార్మికుల సార్వత్రిక సమ్మెకు సంబంధించి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధా నకార్యదర్శి చక్రపాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి16న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను నిర్వహించడం జరుగుతోందని ఆరోజు సమ్మెలో మధ్యాహ్నభోజన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఈకార్యక్రమంలో సాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నిజామాబాద్‌అర్బన్, జనవరి 30:జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మంగళవారం నగరంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో విద్యాశాఖ సహాకారంతో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 46మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా పశుసం వర్ధక శాఖాధికారి డాక్టర్ జగన్నాథచారి జంతు సంక్షేమం గురించి వివరించారు. ఈకార్యక్రమంలో సహాయ సంచాలకులు బాలిక్‌అహ్మద్, బస్వారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

3న చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

● టీయూ పీడీఎస్‌యూ పిలుపు


టీయూ చలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరించిన పీడీఎస్‌యూ సభ్యులు

డిచ్‌పల్లి, జనవరి 30: నూతన జాతీయ విద్యా విధానం 2020 ను రద్దు చేయాలని ఫిబ్రవరి 3న ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో జరిగే ధర్నా విజయంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వర్సిటీ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట ఢిల్లీ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ..నూతన విద్యావిధానం రాజ్యాంగస్ఫూర్తి దెబ్బతీస్తోందని నేడు ఉన్న అకాడమీ స్ట్రక్చర్ మార్చి విద్యార్థులకు ఐడలజికల్ ఫ్రేమ్‌వర్క్ దెబ్బతీస్తోందన్నారు. ఫిబ్రవరి 3న విద్యార్థులు, మేధావులుఢిల్లీ లో జరిగే ధర్నాను విజయవంతం చేయలన్నారు.ఈకార్యక్రమంలో పీడీఎస్‌యూ కార్యదర్శి జయం తి, అక్షయ్, రవీందర్, అకాశ్, మోహిత్, వంశీ, రామకృష్ణ, మోహిత్, ప్రవీణ, వివేకవర్ధిని, నవ్య, రేణుక, అనూష, రాకేశ్, రాము, పాల్గొన్నారు.

'పది' వసతి గృహ విద్యార్థులకు ప్రేరణ

నిజామాబాద్‌అర్బన్, జనవరి 30:జిల్లాలోని ప్రభుత్వ బీసీ వసతిగృహాల్లో పదోతరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై మంగళవారం ప్రేరణ, అవగాహన తరగతులు నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖ అధ్వర్యంలో నగరంలోని న్యూఅంబేద్కర్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ శాఖ అధికారి రమేష్ ప్రారంభించగా నర్సయ్య, గంగాకిషన్ సహాయ అధికారులు పర్యవేక్షించారు. జిల్లాలోని అత్యుతమ ఉపాధ్యాయ నిపుణులు శారద తెలుగు, హజారే శ్రీనివాస్ హిందీ, అరవింద్ ఇంగ్లీష్, సతీష్‌రెడ్డి గణితం, లక్ష్మీనాదం ఫిజిక్స్, రమేష్ బాయోలజికల్ సైన్స్, ఎస్.మురళీధర్ సోషల్‌లు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

పల్లెకు పోదాం అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి

పెద్దబజార్, జనవరి 30:రాబోయే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెటుకుని గావ్ చలో అభియాన్(పల్లేకు పోదాం అభియాన్)కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గావ్ చలో అభియాన్‌లో భాగంగా ఫిబ్రవరి5 నుంచి 8వరకు 24గంటల పాటు ప్రతి గ్రామంలో నాయకులు కార్యకర్తలు పర్యటించనున్నారన్నారు. వచ్చే పా ర్లమెంటు ఎన్నికల్లో ఓటింగ్ 51శాతం పెంచడమే లక్ష్యంగా గావ్ అభియాన్ ముఖ్యోద్దేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అభియాన్ రాష్ట్ర కోఆర్డీనేటర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండెల లక్ష్మీనారయణ, బీజేపీ నాయకులు పోతన్‌కర్ లక్ష్మీనారయణ, స్వామియాదవ్, సందీప్‌కుమార్, భాస్కర్, మండల అధ్యక్షులు, కన్వీనర్లు, కో కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా అంతటా గాంధీకి ఘన నివాళి

ధర్పల్లి,జనవరి30:మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని గాంధీ వర్ధంతి సందర్భంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం మండలంలోని దమ్మన్నపేటతో పాటు గుడితండా గ్రామంలో సైతం గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ అడుగు జాడల్లో నడువాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాలరాజు, మాజీ ఎంపీపీ ఇమ్మడిగోపి, కాంగ్రెస్ నాయకులు మనోహర్ రెడ్డి, రాంచందర్‌రెడ్డి, నర్సింగ్ రావ్, మిట్టపల్లి గంగారెడ్డి, వై.గంగారెడ్డి, రమేష్‌గౌడ్, మోతీరాం, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. గాంధీనగర్‌లోని ఆయన విగ్రహానికి మండలకాంగ్రెస్ అధ్యక్షుడు సుంకట రవి తదితరకాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెండు నిముషాలు మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు సుంకెటరవి, నాయకులు ప్రసాద్,సీనియర్ నాయకులు నూకల బుచ్చి మల్లయ్య, ప్రదీప్, గణేష్‌గౌడ్, శేఖర్, జగదీశ్, గంగాధర్, ప్రతాప్, గాంధీనగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: జాతిపిత మహాత్మగాంధీకి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. మంగళవారం డొంకేశ్వర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంధీ వర్ధంతి సందర్భంగా మండల అధ్యక్షుడు భూమేష్ రెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నూత్‌పల్లి గ్రామంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గోకగంగారెడ్డి, గోపి, చిన్నారెడ్డి, అశోక్, మహేష్, నరోత్తం,శ్యామ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


దమ్మన్నపేటలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రూరల్ ఎమ్మెల్యే

వచ్చే నెలలో మరో రెండు గ్యారెంటీల అమలు

● ధరణి బాధితులకు న్యాయం చేస్తాం ● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి


మద్దెపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవీపేట,జనవరి30: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఈ పాటికే రెండు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తుండగా వచ్చే నెలలో మరో రెండు గ్యారెంటీ పథకాలను అమలు చేయనున్నామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అభంగపట్నం, మట్టయ్య ఫారం, అబ్బాపూర్(బి), మద్దెపల్లి, యంచ, నందిగాంలలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మద్దెపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. ధరణి పోర్టల్ ఏర్పాటుతో చాలా మంది రైతుల భూముల రికార్డులు ఆగమాయ్యాయని త్వరలోనే సంబంధిత రికార్డులను సరి చేసి బాధిత రైతులకు న్యాయం చేస్తామని ఆయన పేర్కొన్నారు. మిషన్ భగీరథ పథకాన్ని కేవలం కమిషన్‌లు పొందడానికి మాత్రమే ఏర్పాటు చేశారని, ఈ పథకం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండు మాసాల క్రితమే అధికారంలోకి రాగా తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్‌రావులు అవాకులు, చెవాకులు పేలుతున్నారని అన్నారు. ఇప్పటికై వారు తమ నాలుకను అదుపులో ఉంచుకోకపోతే వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గతంలో కాంగ్రెస్ పాలనలోనే అలీసాగర్ ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయడంతో ఈ రోజున ఆయకట్టు రైతులు ఆనందంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభంగపట్నం, మట్టయ్య ఫారం, మద్దెపల్లిలలో నూతన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాహెర్ బిన్ హందాన్, ఎంపీపీ సంగెం శ్రీనివాస్, జడ్పీటీసీ సవిత, వైస్ ఎంపీపీ హరీష్ కుమార్, సర్పంచ్‌లు రమాదేవి,రేణుక, లావణ్య, రాము, ఎంపీటీసీలు పార్వతి, లలిత, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ గౌడ్, రాజేందర్‌గౌడ్, గోవర్ధన్ రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న వైద్యుడు ఆనంద్‌కుమార్

మాక్లూర్, జనవరి30: కుష్టువ్యాధి ఒకరి నుంచి ఒకరికి ఎలా సోకుతుందని తదితర అంశాలపై మంగళవారం మాక్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సును వైద్యుడు ఆనంద్‌కుమార్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు అన్ని గ్రామాలలో ఎఎన్ఎంలు, ఆశావర్కర్‌లు, కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తార న్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, ఉపసర్పంచ్, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు ప్రజలు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి:మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కుష్టువ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ వ్యాధి నివా రణపై కుష్టు వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్‌రవీందర్, ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, మండల కోఆప్షన్‌సభ్యుడు అక్బర్‌ఖాన్, వైద్యసిబ్బంది, ఆశవర్కర్‌లు, అంగనవాడీ టీచర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో యూపీహెచ్‌సీ కేంద్రంతో పాటు అంగన్‌వాడీ సెంటర్‌లో కుష్టువ్యాధిపై డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్ ప్రజలకు అవగాహన కల్పించారు. కుష్టువ్యాధి ఒక అంటు వ్యాధి అని దీర్ఘకాలిక సహ వాసం చేసిన వారికి చర్మం ద్వారా ఒకరి నుంచి ఒకరికి అంటుతోందని, మన దేశంలో ఈ వ్యాధి జీరో స్థాయికి నిర్మూలించబడిందని అన్నారు. చర్మంపై పాలి పోయిన రాగి రంగులో స్పర్శ లేనట్టయితే ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి తగిన మందులు పొందాలని ఆయన అన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో మెడి కల్ ఆఫీసర్ ఫాతిమ, కృష్ణమూర్తి, అండూస్, సాయి, సంపత్, అనురాధ, కమల, రాజవ్వ, ఆనంద్, ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.

డొంకేశ్వర్:మండలం దత్తాపూర్, తొండాకూర్ గ్రామాలలో కుష్టు వ్యాధిపై ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడి కేంద్రాలలో, పంచాయతీ కార్యాలయాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. దేశంలో కుష్టు వ్యాధి లేకుండా చేయడానికి ఆరోగ్యశాఖ అన్ని ప్రయత్నాలు చేస్తుందని సూపర్‌వైజర్ సురేందర్; ప్రమీల అన్నారు. ఎవరికైనా లక్షణాలు కనిపించినట్టు అయితే సంబంధిత ఆరోగ్య సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సురేందర్, ప్రమీల,ఆశావర్కర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం జాతీయ లెప్రసీ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచ్ పత్తి లక్ష్మణ్ అధ్యక్షతన లెప్రసీ నివారణపై అవగాహన కల్పించారు. లెప్రసీ లక్షణాలు, వ్యాప్తి, నివారణ, చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం లెప్రసీ నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభాకర్, ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, విండో అధ్యక్షులు కూచి సిద్దు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలోనే ఆర్మూర్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

● అర్హులైన వారికే ప్రభుత్వ పథకాలు అందాలి : ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జనవరి30: ఆర్మూర్ నియోజకవర్గాన్ని తెలంగాణలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పస్క.నర్సయ్య అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతో పాటు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో వైషమ్యాలు ఉండొద్దని, పల్లెలు పచ్చగా ఉండాలన్నదే తన అభిమతమని అన్నారు. ప్రజలు ఐక్యమత్యంతో ఉండాలని గ్రామాలలో నాయకులు, ప్రజల మధ్య గొడవలు ఉండొద్దన్నారు. అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని, అభివృద్ధిలో అన్ని పార్టీలు ఒక్కటై నడవాలన్నారు. రాజకీయాలు వేరు, అభివృద్ధి వేరు అని ఎన్నికల వరకు రాజకీయాలు ఉండాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సూచించారు. నాయకులు, ప్రజలు అధికారులను గౌరవించి పనులు చేయించుకోవాలన్నారు. సర్పంచ్‌లుగా దిగిపోయినప్పటికీ మీ సలహాలు, సూచనలు తమకు అందజేయాలన్నారు. కోటీశ్వరులకు పింఛన్ ఇస్తే పేదవాడి సంగతేంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పస్క నర్సయ్య, జడ్పీటీసీ మెట్టు సంతోష్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్‌లు శ్రీకాంత్, నరేష్, ఎంఈవో రాజగంగారాం, ఏవో హరికృష్ణ, పశువైద్యాధి కారులు లక్కం ప్రభాకర్, ఏఈ నితిష్, ఏపీవో సురేష్, ఏపీఎం గంగా రాం, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

● వికలాంగులకు ఎలక్ట్రిక్ వీల్‌చైర్‌ల పంపిణీ

ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దివ్యాంగులకు పోటీలు, ఎలక్ట్రిక్ వీల్‌చైర్మన్‌లను ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వీల్‌చైర్‌లు అందజేయడం వల్ల తల్లిదండ్రులకు ఇబ్బందులను తగ్గించడానికి ఇవీ ఉపయోగపడుతాయన్నారు. అదే విధంగా యానంగుట్ట సుం దరయ్య కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు వెంకటేష్‌ఎల్లయ్య ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

మాక్లూర్: రాజకీయాలు పక్కన పెట్టి రాజకీయాలకు అతీతంగా అభి వృద్ధి చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతో కలిసి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కోసం పాటుపడాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఎంపీడీవో క్రాంతి ఉన్నారు.

● నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

జిల్లా వంజరి సంఘం 2024 నూతన సంవత్సర క్యాలెండర్ మంగళవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోనేకర్ భూమయ్య, నాగర అధ్యక్షుడు గంగోని గంగాధర్, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కరిపే రవీందర్, రాష్ట్ర సభ్యులు శంకర్, శ్రీనివాస్, గోపాల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ సొసైటీ ఎన్నిక వాయిదా


సొసైటీ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

రెంజల్,జనవరి30: మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఎన్నికను మంగళవారం నిర్వహించగా లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ వల్ల ఎన్నికను వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి సత్యనారాయణ తెలిపారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు బందోబస్తును రూరల్ సీఐ శ్రీనివాస్ రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఐదుగురు సభ్యులతో ఎన్నికల కౌటింగ్ వద్దకు వచ్చిన ఇన్‌చార్జి చైర్మన్ మొయినోద్దీన్, ఎన్నికల వాయిదా పడడంతో వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో సీఈవో రాము గౌడ్, ఎస్ఐ ఉదయ్ కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ సభ్యత్వ నమోదు కార్యక్రమం

జక్రాన్‌పల్లి, జనవరి30: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలో మంగళవారం పీడీఎస్‌యూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పీడీఎస్‌యు ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు, మండల బాధ్యులు అనిల్‌కుమార్ తెలిపారు. అనంతరం విద్యార్థులకు పీడీఎస్‌యూ సభ్యత్వ నమోదు చేయించారు. ఈకార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు సుమంత్, వర్షిత్, హబీ, పీడీఎస్‌యు నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను సందర్శించిన రాష్ట్ర సెక్రెటరీ

రెంజల్,జనవరి30: మండల కేంద్రంలో నిర్మించిన మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల నూతన భవనాన్ని రాష్ట్ర సెక్రెటరీ ఆయేషా మస్రత్ ఖనమ్ మంగళవారం సందర్శించారు. పాఠశాల భవనం యొక్క వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నపాటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొద్ది రోజుల్లోనే అద్దె భవనం నుంచి నూతనంగా నిర్మించిన పాఠశాల భవనంలోకి రానున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీఎండబ్ల్యూ కృష్ణవేణి, ఆర్ఎల్‌సీ బషీర్, విజిలెన్స్ ఆఫీసర్స్ జియా, రెంజల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అర్షియా నజం, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్లలో ఉపాధ్యాయులకు ఘన వీడ్కోలు


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఏర్గట్ల, జనవరి30: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో.. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు తోటి సిబ్బంది, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొమరగిరి కృష్ణాచారి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తిలో బదిలీ అనేది సహజమన్నారు. ఉపాధ్యాయులు ఎక్కడ పని చేసినా.. పిల్లల అభివృద్ధి, ఉన్నతి ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. అనంతరం శ్రీధర్, రమేష్, మురళీకృష్ణ, కపిల్,శ్యామ్, రవికుమార్, ఉదయ భాస్కర్ తదితర ఉపాధ్యాయులను హెచ్‌ఎం, విద్యార్థులు సన్మానించారు.

ప్రాణం తీసిన పేకాట

● రూ.200ల కోసం హత్య ● సీపీ పర్యవేక్షణలో విచారణ

ఖిల్లా, జనవరి 30:పేకాటలో పోగొట్టుకున్న డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య జరిగిన గొడవ ప్రాణం మీదికి వచ్చింది. కేవలం రెండు వందల రూపాయల కోసం గొడవ పడి మంటల్లో తోసి హత్య చేసిన ఘటనపై పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌శింగేనేవార్ ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం ఉదయం నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్, నగర ఇన్‌స్పెక్టర్ నరహరి నేతృత్వంలో నిందితుల కోసం విచారణ చేస్తున్నారు. సోమవారం వెలుగులోకి వచ్చిన ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. యువకుడిని హత్య చేసిన ఆగంతకులు డెడ్‌బాడీ ఆనవాళ్లు దొరకకుండా కాల్చివేశారు. నగరంలోని రెండో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓపాఠశాల వెనుక పాడుబడిన ఇంటిలో గుర్తు తెలియని యువకుడిని కేవలం రూ 200లకోసం హత్యచేసి దహనం చేశారని పోలీసులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు రంగంలోకి దిగిన పోలీసులు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ.రాజశేఖర్ రాజు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ విజయ్ బాబుతో పాటు పోలీసు సిబ్బంది నిందితుల కోసం విచారణ చేస్తున్నారు. ఈ ఘటనలో హత్యకు గురైన యువకుడు హాశ్మీకాలనీకి చెందిన ముఖీద్ (25)తో పాటు గాయాల పాలయిన మరో యువకుడు శేఖ్ అహ్మద్, ఇస్మాయిల్, మన్సూర్‌లు కలసి పేకాట ఆడడానికి వెళ్లి ఉంటారని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.పేకాట ఆడుతున్న సమయంలో చీకటిగా ఉండడం వల్ల వెలుతురు కోసం కొవ్వొత్తి వెలిగించినట్లు పోలీసుల విచారణలో తేలింది. గాయాల పాలయిన అహ్మద్ పొంతన లేకుండా సమాధానం ఇవ్వడంతో కేసు విచారణ చేస్తున్న పోలీసులకు వాస్తవాలు సేకరించేం దుక ఇబ్బంది పడుతున్నారు. మంటల్లో ముఖీద్‌ను తోసేసిన యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఘటన జరిగిన ప్రాం తంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. కేసుపై సీపీ ప్రత్యేక దృష్టి సారిం చడంతో ఏసీపీ స్థాయి అధికారితో పాటు టాస్క్‌ఫోర్స్ బృందం, డ్వాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్, రెండోటౌన్ పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేస్తున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్,జనవరి30: పట్టణంలోని యోగేశ్వరకాలనీలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న పేకాట రాయుళ్లను ఎస్సై గంగాధర్ అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్న సమాచారం మేరకు దాడి చేయగా ముగ్గురు పేకాట రాయుళ్ళ నుంచి రూ.28వేల 870 నగదుతో పాటు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

చికెన్ ధరలు




రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,250	రూ.59,250	రూ.760

సినిమా గైడ్ నిజామాబాద్



పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఫైటర్ (హిందీ 3డీ) (12.15, 3.50, 7.25, 11.00)
స్క్రీన్-2 : హనుమాన్ (తెలుగు) (12.00, 3.20, 6.40, 10.00)
స్క్రీన్-3 : గుంటూరుకారం (3.40, 10.10)
: నా సామిరంగ (7.00)
స్క్రీన్-4 : హనుమాన్ (12.50, 7.20)
: కెప్టెన్ మిల్లర్ (4.10, 10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కెప్టెన్ మిల్లర్ (10.30)
: హనుమాన్ (1.20, 4.25, 7.30, 10.30)
స్క్రీన్-2 : గుంటూరుకారం (1.10, 7.30)
: ఫైటర్ (హిందీ 3డీ) (4.20, 10.40)
స్క్రీన్-3 : హనుమాన్ (11.00)
: కెప్టెన్ మిల్లర్ (2.10, 7.35)



దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : గుంటూరుకారం 11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ఫైటర్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కెప్టెన్ మిల్లర్ (11.15, 2.15, 6.15, 9.15)

\- నిజామాబాద్ అర్బన్